శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు


శ్రీలలితాపీఠంలో శత చండీయాగానికి సిద్ధం చేసిన హోమగుండం


సీతంపేటలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన భారీ పెండాల్

సీతంపేట: దుర్గా శరన్నవరాత్రి వేడుకలకు ఉత్తర నియోజకవర్గం సిద్ధమైంది. గురువారం నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్రి మహోత్సవాలకు పందిర్లు, అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. కాలనీలు, వీధుల్లో మండపాలు నిర్మించి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిపేందుకు ఉత్సవ కమిటీలు సిద్ధమవుతున్నాయి. ఆటో, లారీ, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్లు, కార్మిక సంఘాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లోని ఉద్యోగులు దుర్గా నవరాత్రులు పెద్ద ఎత్తున జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దుర్గాదేవి అమ్మవారి విగ్రహాలకు కోల్‌కతా కళాకారులు తుది మెరుగులు దిద్దుతూ బిజీగా ఉన్నారు.


శరన్నవరాత్రి ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రామాలయం కమిటీ సభ్యులు

శ్రీలలితాపీఠంలో... : దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీలలితాపీఠంలో గురువారం నుంచి 12వ తేదీ వరకు శతచండీ యాగం నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం 4 గంటలకు లలిత అమ్మవారికి పంచామృత అభిషేకం, అర్చన, బాలభోగం నివేదన జరుగుతుంది. అనంతరం చండీ పారాయణ, గోపూజ, శ్రీచక్రనవావరణార్చన, సాయంత్రం 3.30 గంటలకు చండీ హోమం, సామూహిక కుంకుమార్చన జరుగుతుంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం కలశస్థాపన, లక్ష్మీగణపతి హోమం, చండీ హోమం, 4న మహాలక్ష్మి **షడక్షరి హోమం, 5న సుదర్శన హోమం, 6న మహాసౌరం అరుణ హోమం, 7న వారాహి హోమం, లలితాదేవి హోమం, 8న సుబ్రహ్మణ్యస్వామి, సర్పసూక్త హోమం, ప్రత్యంగిరా భద్రకాళిహోమాలు,** 9న సరస్వతి దేవి, రాజశ్యామల హోమం, 10న కాళీ మన్యుపాశుపత హోమం, 11న వనదుర్గా, శ్రీవిద్యా హోమం, 12న 108 ద్రవ్యాలతో పూర్ణాహుతి జరుగుతుంది. ప్రతి రోజూ మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని, ఈ విశేష పూజా కార్యక్రమాలలో భక్తులు పాల్గొని తరించాలని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

సీతంపేటలో... : రాధాకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతంపేటలో ఎనిమిదేళ్లుగా దుర్గా నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నవరాత్రుల్లో ప్రతి రోజు విశేష పూజా కార్యక్రమాలతో స్థానికులను భాగస్వామ్యం చేస్తూ అధ్యాత్మికత పెంపొందిస్తున్నారు. ఈ ఏడాది కూడా భారీ ఎత్తున ఉత్సవాలు జరపడానికి పెండాల్ నిర్మించి నవరాత్రి పూజలకు ఏర్పాట్లు చేశారు.

శ్రీనివాసనగర్‌లో... : శ్రీదుర్గా మహిళా పూజా కమిటీ ఆధ్వర్యంలో 44వ వార్డు శ్రీనివాసనగర్‌లో శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా గురువారం సామూహిక కుంకుమ పూజ, 4న కోలాటం, 7న సారె ఊరేగింపు, 8న లక్ష కుంకుమార్చన, 9న చిన్నారులచే సరస్వతి పూజ, 10న అన్న సమారాధన, 11న దీపారాధన, 14న తిరువీధి మహోత్సవం జరుగుతుందని కమిటీ తెలిపింది.


శంకరమఠం వద్ద సిద్ధమవుతున్న దుర్గా దేవి మట్టి విగ్రహాలు

పార్వతీశ్వరాలయంలో... : స్థానిక పార్వతీశ్వరాలయంలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ తెలిపారు. నవరాత్రి తొమ్మిది రోజులు పార్వతీదేవి రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని, ప్రతి రోజూ కుంకుమ పూజలు జరుగుతాయని తెలిపారు.

కనకమ్మ ఆలయంలో... : స్థానిక సీతంపేటలో కొలువైన కనకమ్మ ఆలయంలో శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు శివగణేష్ శర్మ పర్యవేక్షణలో ప్రతి రోజూ అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో వెలసిన లలితాదేవి ఆలయంలో శరన్నవరాత్రి పూజా మహోత్సవాలు గురువారం నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్ తెలిపారు. రామాలయంలో ఉత్సవాల కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ కార్యదర్శి సనపల వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రోజూ అమ్మవారు ప్రత్యేక అవతారంలో దర్శనమిస్తారని ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. కుంకుమార్చనల్లో పాల్గొనదల్చిన మహిళా భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ కోశాధికారి పెంటకోట శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఎంఎస్‌కే మోహన్, పెంటకోట వెంకటరావు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


క్లుప్తంగా

స్విమ్మింగ్‌లో సాహూ సత్తా


పతకాలతో అనిల్ సాహూ

మురళీనగర్: రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ పోటీల్లో మురళీనగర్‌కు చెందిన టి.అనిల్ సాహూ తన సత్తా చాటాడు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీలో ఆయన ఒంటి చేత్తో ఈదుతూ మూడో స్థానాన్ని సాధించి కాంస్య పతకాన్ని సాధించాడు. 50 మీటర్లు, 100 మీటర్లు ఫ్రీ స్టైల్ విభాగంలో ఆయన ఈ ఘనత సాధించి జాతీయ స్థాయిలో నిర్వహించనున్న పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో గోవాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలో తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని స్విమ్మింగ్ పూల్‌లో కోచ్ రామారావు పర్యవేక్షణలో శిక్షణ పొందాడు. అనిల్ సాహూ జాతీయ స్థాయికి ఎంపికైన సందర్భంగా వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి పి.సత్యనారాయణరాజు, ఎల్‌వీ సుధాకర్, ఇతర కమిటీ సభ్యులు ఆయనను అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


రికార్డులు పరిశీలిస్తున్న సీఐ అమ్మినాయుడు

సీతమ్మధార: వాహన చోదకులంతా విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు సూచించారు. మంగళవారం ఫోర్తుటౌన్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పలు రికార్డులు, పెండింగ్ ఫైల్ పరిశీలించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడారు. వాహన చోదకులంతా విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లరాదని, అలాగే బస్టాపుల వద్ద ఆటోలను పార్కింగ్ చేయవద్దని హెచ్చరించారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్ ప్రమాణాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు చాలామంది ఆర్టీసీ బస్సుల ఫుట్‌బోర్డులపై వేలాడుతూ ప్రయాణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి ప్రయాణాలు మానుకోవాలని హెచ్చరించారు.

వరద బాధితులకు ఏయూ అనుబంధ కళాశాలల విరాళాలు


ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావుకు చెక్కులు అందిస్తున్న అనుబంధ కళాశాల ప్రతినిధులు

మద్దిలపాలెం : విజయవాడ వరద బాధితుల సహాయమందించేందుకు ఆంధ్రవిశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలు ముందుకు వచ్చాయి. కె.కోటపాడులోని అయ్యన్న డిగ్రీ కళాశాల రూ.లక్ష, విశాఖసెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల రూ.80 వేలు, సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల రూ.లక్ష , విజయనగరంలోని శ్రీ లక్ష్మీగణపతి కళాశాల రూ.12 వేలు చెక్కులను కళాశాల ప్రతనిధులు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు అందజేశారు. ఈ చెక్కులను సీఎం సహాయనిధికి పంపనున్నామని రిజిస్ట్రార్ చెప్పారు. కార్యక్రమలో సి.డి.సి. డీన్ ఆచార్య టి.వి.కృష్ణ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మద్రిపాలెం: అగ్ని ప్రమాదాలపై హోటల్ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి కె.వి.టి. ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ 51వ వార్డు ఆర్‌అండ్‌బి జంక్షన్‌లోని మారియట్ హోటల్‌లో సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాల్లో ఉపయోగించే అత్యవసర సాధనాలు, స్మోకింగ్ డిటెక్టర్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

వృద్ధులను గౌరవిద్దాం


వృద్ధులకు నిత్యావసర సరకులు అందిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: వృద్ధులను, ఇంట్లో పెద్దలను గౌరవించాలని మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి పిలుపునిచ్చారు. మురళీనగర్ సమీపంలోని పట్టాభిరెడ్డి తోట వానప్రస్థ వృద్ధాశ్రమంలో వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు మంగళవారం వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. పిల్లలు తమ తల్లిదండ్రులను ఆప్యాయంగా చూసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి వృద్ధుడిగా మారుతాడన్న విషయాన్ని గ్రహించి ఇంట్లోని పెద్దలను జాగ్రత్తగా చూసుకుని సేవలు చేయాలన్నారు. పెద్దల సలహాలు కుటుంబ నిర్వహణలో ఎంతో అవసరమవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు ఉదయం ఫలహారం అందించారు. అనంతరం వీరు ప్రియదర్శిని వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడి వృద్ధుల బాగోగులను తెలుసుకున్నారు. వీరికి అవసరమైన నిత్యావసర సరకులను నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి పి.కమల, ఉపాధ్యక్షులు సీహెచ్ వరలక్ష్మి, పూర్వ అధ్యక్షులు డి.శిరీష, ఎం.శేషామణి పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పరిసర ప్రాంతాల్లో నిరుపేదలుగా జీవిస్తూ, ఎటువంటి ఆసరా లేని వృద్ధులను ఆహ్వానించారు. వీరందరికీ నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 పూర్వ గవర్నర్ ఉప్పలపాటి శుభ, వనితా వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎం.జయ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


వానప్రస్థ ఆశ్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

లయోలా వృద్ధాశ్రమంలో..

ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమాన్ని మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు మంగళవారం సందర్శించారు. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న 200మంది వృద్ధులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వీరికి అవసరమైన నిత్యావసర సరకులు, 80 జతల దుస్తులు నిర్వాహకుడు బి.ప్రకాశరావుకు అందించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వరాజు, పూర్వ అధ్యక్షుడు రాళ్లపల్లి సత్యనాథం, కోశాధికారి జె.కూర్మారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు ఆర్.నాగేశ్వరరావు, ఎస్.రామ్మోహనరావు, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వండి


సమావేశంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు,ఇతర అధికారులు

మహారాణిపేట: అనారోగ్యంలో ఆయా ఆస్పత్రులకు వచ్చే వృద్ధులకు వైద్యులు, సిబ్బంది అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి ఎక్కువ సేపు ఆస్పత్రిలో నిరీక్షించకుండా వెంటనే వైద్యం అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా అన్ని ఆస్పత్రులలో ఈ విధానం అమలు చేయాలన్నారు. ఆరోగ్య విషయంలో వృద్ధులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈమేరకు వైద్యశాఖ అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో పలువురు నోడల్ అధికారులు డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ సమత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జీవన్ రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. రామాటాకీస్ దగ్గరలో ఉన్న గోల్డెన్ ఏజ్ ఆశ్రమంలో వద్ధులకు బి.పి, షుగర్, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

రాంగ్ రూట్‌లో ప్రయాణాలు అరికట్టాలి


నక్కవానిపాలెంలో రాంగ్‌రూట్‌లో వెళ్తున్న వాహనాలు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24వ వార్డులో గల నక్కవానిపాలెం తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా గల రహదారిలో రాంగ్‌రూట్‌లో ప్రయాణాల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ వెళ్లే రోడ్డులో నిత్యం పలువురు ద్విచక్ర వాహన చోదకులు, ఇతర వాహనాలు రాంగ్‌రూట్‌లో రావడం అలవాటుగా మారింది. ఆ మార్గంలో ట్రాఫిక్ పోలీసులు ఉండని కారణంగా ఇష్టానుసారంగా వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఈ మార్గంలో రైల్వేస్టేషన్ నుంచి ఆరిలోవ వెళ్లే 69 నంబర్ సిటీబస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. రైతుబజార్, ఆక్సిజన్ టవర్స్, తహశీల్దార్ కార్యాలయం, యూనియన్ బ్యాంక్, ఇతర దుకాణాలు, మాల్స్ ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. రాంగ్ రూట్లో ప్రయాణించడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు స్పందించి రాంగ్ రూట్ ప్రయాణాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య


మృతుడు అప్పన్న

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో మృతదేహం లభ్యమైంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో ఆర్కేబీచ్ వద్ద మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. దీన్ని గమనించిన సందర్శకులు బీచ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు మురళీనగర్‌కు చెందిన మామిడి అప్పన్నగా గుర్తించారు. మద్యానికి బానిసైన అప్పన్నకు కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగోలేదు. మద్యం తాగేందుకు రెండు రోజులుగా ఆయన భార్య డబ్బులు ఇవ్వలేదు. దీంతో సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ముగిసిన 'బొబ్బిలి వీణ' తయారీ శిక్షణ

డాబాగార్డెన్స్: లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్(ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ) రెండు నెలలుగా విజయనగరం జిల్లా గొల్లపల్లిలో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, బొబ్బిలి వీణ తయారీ శిక్షణ మంగళవారంతో ముగిసింది. లేపాక్షి ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత, ఎం.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎం.విశ్వ పలువురు అధికారుల ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఫండ్ ద్వారా విశాఖపట్నం లేపాక్షి మేనేజర్ ఎ.కార్తీక్ నేతృత్వంలో ఈ శిక్షణ నిర్వహించారు.

కార్లు తొలగింపు


కార్లు తీసేసిన తరువాత ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ వెనుక విశాలంగా ఉన్న రహదారి

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 14వ వార్డు నార్త్‌ఎక్స్‌టెన్షన్, ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ వెనుక రోడ్డులోని ప్రైవేట్ ట్రావెల్స్‌కు సంబంధించిన అడ్డదిడ్డంగా పార్కు చేసిన కార్లను ద్వారకా ట్రాఫిక్ ఎస్.ఐ. భాస్కరరావు తన సిబ్బందితో మంగళవారం క్లియర్ చేయించారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'అడ్డగోలు పార్కింగ్‌తో ఇక్కట్లు' అనే శీర్షికన కథనం వెలువడింది. ఈ కథనానికి స్పందించిన ద్వారకా ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ఇరువైపులా ఉన్న కార్లను క్లియర్ చేయించారు. మరో సారి ఇలా అడ్డగోలుగా వాహనాలు పార్క్ చేస్తే కేసులు నమోదు చేస్తామని ప్రైవేటు ట్రావెల్స్ యజమానులను హెచ్చరించారు.

కళా సేవకుడు చెన్నా


చెన్నా తిరుమలరావును సత్కరిస్తున్న దాడి సత్యనారాయణ

సీతమ్మధార: సాంస్కృతిక రంగంలో తనదైనశైలిలో సేవలందిస్తున్న మహోన్నత వ్యక్తి చెన్నా తిరుమలరావు అని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ కొనియాడారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర పంక్షన్ హాలులో మంగళవారం సాయంత్రం ఫ్యామిలీ మెలోడీస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో స్థానిక కళాకారులకు పెద్దపీట వేయాలని ఉద్యమించిన కళాకారుడు చెన్నా తిరుమలరావు అని కొనియాడారు. చెన్నా మాట్లాడుతూ విశాఖ ఉత్సవ్, డ్వాక్రా బజారు వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక కళాకారులను కాదని, వివిధ రాష్ట్రాల నుంచి తీసుకురావడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫ్యామిలీ మెలోడీస్ కన్వీనర్ శివ నారాయణ, విశ్వప్రసాద్, గాయని కోమలి తదితరులు పాల్గొన్నారు.

'గొంతు తెగిన అక్షరం' పుస్తకావిష్కరణ

డాబాగార్డెన్స్: స్థానిక ఏవీఎన్ కళాశాలలో మంగళవారం 'గొంతు తెగిన అక్షరం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. యువకవి సిర్పి చంద్రశేఖర్ రచించిన ఆ పుస్తకాన్ని ఏవీఎన్ కళాశాల, సహృదయ సాహితీ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో జరిగిన సభలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, శేఖర్ మంత్రి ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లా డుతూ చిన్న వయస్సులోనే కవిగా, రచయితగా మంచి పేరు సంపాదించిన యువకవి చంద్రశేఖర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లా డుతూ చిన్న వయస్సులోనే రచనలు, కవితల ద్వారా చంద్రశేఖర్ మంచి ప్రతిభ కనబరిచారన్నా రు. డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ సమా జంలో యువతరానికి చంద్రశేఖర్ స్ఫూర్తిదాయకంగా నిలిచారంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, శంకర నారాయణరావు, స్వరాజ్యలక్ష్మి, తెలుగు విభాగధిపతి పి.వెంకటరత్నం, గాయత్రీ, నరసింహమూర్తి, పైడి రజని పాల్గొన్నారు.

16న జోన్-5లో వాణిజ్య సముదాయాలకు వేలం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-5 పరిధిలో 40 నుంచి 63వ వార్డు వరకు ఖాళీగా ఉన్న జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు సైడ్ మార్కెట్లకు ఈ నెల 16న జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ బి.రాము మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో 8, 22, 24, 48, 52, 54, 55, 56, 57, 58 నంబర్ల దుకాణాలు, సంజీవయ్య కాలనీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒకటవ నంబరు దుకాణం, త్రినాథపురం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒకటవ నంబరు దుకాణం దుకాణం, 51వ వార్డులో గల మాధవస్వామి కల్యాణమండపం మూడేళ్ల కాలపరిమితికి, గుల్లలపాలెం దుకాణంరోడ్డు పక్కన మార్కెట్స్ హాకర్ మండలం, పల్లివీధి రోడ్‌సైడ్ మార్కెట్, జనతాకాలనీ(బుధవారం) వారం మార్కెట్, కంచరపాలెం రోడ్‌సైడ్ మార్కెట్, తాటిచెట్లపాలెం రోడ్‌సైడ్ మార్కెట్, అక్కయ్యపాలెం రోడ్డు సైడ్ మార్కెట్‌లకు ఏడాది కాలపరిమితికి అద్దెకు ఇచ్చేందుకు వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు జీవీఎంసీ నిబంధనలకు లోబడి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు జోన్-5 కార్యాలయంలో పర్యవేక్షకుడిని పని వేళల్లో సంప్రదించాలని జోనల్ కమిషనర్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట: కేంద్ర ప్రభుత్వం విశాఖస్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే రద్దు చెయ్యాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రజా ఉద్యమానికి మద్దతుగా మంగళవారం నరసింహనగర్ రైతుబజార్‌వద్ద ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ అధికారం చేపట్టాక ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ జోలికి వస్తే ఆంధ్రులు కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో రావికృష్ణ, జి.శ్రీనివాస్, పి.సాయికుమార్, జి.గణేష్, ఎరికినాయుడు, జి.సూరిబాబు, ఎం.రాము, టి.కృష్ణ పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన


పిల్లలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీవిద్య

సీతంపేట: పిల్లలకు తొలి దశలో వచ్చే పాల దంతాల పట్ల శ్రద్ధ వహిస్తే రాబోయే శాశ్వత దంతాలు ఆరోగ్యంగా ఉంటాయని దంత వైద్యులు శ్రీవిద్య పేర్కొన్నారు. శంకరమఠం రోడ్‌లోని వీడెంటల్ హాస్పిటల్‌లో మంగళవారం పిల్లల దంతాల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి దంత వైద్యులచే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పిల్లల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన టూత్ పేస్ట్, బ్రష్‌లు వాడాలన్నారు. రాత్రి పూట తప్పనిసరిగా బ్రష్ చెయ్యాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు టూత్ పేస్టులు, డ్రాయింగ్ పుస్తకాలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వీ డెంటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ సి.హెచ్.పార్వతి, డాక్టర్ తరుణ్, యూరో కిడ్స్ ప్రిన్సిపాల్ సౌజన్య, రామ్ శంకర్, మేరీ, తులసి పాల్గొన్నారు.

ఘనంగా స్వచ్ఛతా పక్వాడా పక్షోత్సవాలు


స్వచ్ఛతా ప్రమాణం చేయిస్తున్న డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో సెప్టెంబర్ 14వ తేదీన ప్రారంభమైన స్వచ్ఛతా పక్వాడా–స్వచ్ఛతా పక్షోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. కార్యక్రమాల సందర్భంగా మంగళవారం దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో డీఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ అధికారులు, సిబ్బందితో స్వచ్ఛతా ప్రమాణం చేయించారు. ఈ పక్షోత్సవాల్లో భాగంగా డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్లలో, రైళ్లలో, రైల్వే కాలనీలలో, రైల్వే పరిసరాలలో అధికారులు, సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అవగాహన కల్పించే దిశగా పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. బుధవారం మహాత్మగాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా పక్షోత్సవాలను నిర్వహించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రైల్వేస్టేషన్ ఆవరణలో పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

దాదా సాహెబ్‌ఫాల్కే అవార్డ్ గ్రహీతకు అభినందనలు

మద్దిలపాలెం: భారతీయ సినీ పరిశ్రమలో అత్యున్నత ప్రతిష్టాత్మకంగా భావించే దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్‌కు ప్రఖ్యాత సినీ నటుడు మిథున్ చక్రవర్తిని ఎంపిక చేసినట్టు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ ప్రకటించడం అభినందనీయమని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ పేర్కొంది.

ఈసందర్భంగా మిథున్ చక్రవర్తికి అభినందనలు తెలుపుతూ మెయిల్ చేసినట్టు సొసైటీ కార్యదర్శి ఎన్.ప్రకాశరావు తెలిపారు.